సాక్షి మంచిర్యాల

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



విజిట్ వీసా.. ఎడారి గోస!
గల్ఫ్ దేశాల్లో వలస కార్మికులు పలు కారణాలతో పోలీసులకు చిక్కుతున్నారు. వారి జాడ, క్షేమ సమాచారం స్వదేశంలోని కుటుంబ సభ్యులకు తెలియక తల్లడిల్లుతున్నారు. 8లో▸



ఆరంభంతో ఆశలు..
తాండూర్ మండలంలోని బోయపల్లి నుంచి గోండుగూడెం వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో ప్రజల ఆశలు ఆవిరయ్యాయి. 9లో▸

గరిష్టం/కనిష్టం
31.3 /25.2

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. ఉపరితల ఆవర్తనం ప్రభావంతో చాలాచోట్ల జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నులి పురుగుల నిర్మూలనకు కృషి చేయాలి

- కలెక్టర్ కుమార్‌దీపక్



జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅర్బన్: నులి పురుగుల నిర్మూలనకు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్షా 58వేల 480 మంది పిల్లలకు మాత్రలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్, సంక్షేమాధికారి రౌఫ్‌ఖాన్, ఉప వైద్యాధికారి అనిత, ప్రోగ్రాం అధికారి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పక్కదారి పట్టకుండా చర్యలు
మంచిర్యాలఅగ్రికల్చర్: రైతుల అవసరాల మేరకు జిల్లాలో యూరియా అందుబాటులో ఉందని, పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయధికారి భుక్యా ఛత్రునాయక్, ఉద్యానవన శాఖ అధికారి అనితతో కలిసి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యూరియా కృత్రిమ కొరత సృష్టించడం, పక్కదారి పట్టించడం వంటి అంశాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెల 31లోగా వరి సాగు పూర్తి చేయాలని, సాగు ప్రారంభం కాని పక్షంలో ఇతర పంటలు సాగు చేసేలా రైతులను అవగాహన కల్పించాలన్నారు. పత్తిలో అంతర పంటగా మునగ సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల అగ్రికల్చర్: ఈనెల 15న జిల్లా సమీకృత కార్యాలయంలో స్వాతంత్య్ర వేడుకలను అధికారులు సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయ సమావేశ మందిరంలో డీసీపీ భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్యతో కలిసి వివిధ శాఖల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన అధికారుల జాబితాను ఈ నెల 13 వరకు సిద్ధం చేయాలన్నారు. సందేశం రూపొందించడానికి అన్ని శాఖల అధికారులు తమశాఖల నివేదికలను ఈనెల 12 సాయంత్రంలోగా పౌరసంబంధాల శాఖ అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రముఖుల ఆహ్వానం, నిరంతర విద్యుత్ సరఫరా, అత్యవసర ఏర్పాట్లు, అగ్నిమాపక ఏర్పాట్లు చేయాలని సూచించారు.

యోగాసనాల్లో బంగారు పతకాలు



పతకాలు సాధించిన రాహుల్, వైష్ణవి

మంచిర్యాలటౌన్: తెలంగాణ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్‌లోని రత్న గార్డెన్స్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించిన ఆర్టిస్టిక్ యోగా విభాగంలో మంచిర్యాలకు చెందిన ఇద్దరు బంగారు పతకాలు సాధించినట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్కల తిరుపతి వర్మ, మండ శ్రీనివాస్ తెలిపారు. జిల్లాకు చెందిన సీహెచ్.రాహుల్, వైష్ణవి వచ్చే నెలలో ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

బడుల మూసివేత, సిలబస్ తొలగింపు నిలిపివేయాలి

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల మూసివేత, సిలబస్ తొలగింపును నిలిపివేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజావేణు కోరారు. ఇటీవల కలకత్తాలో జరిగిన స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రజతోత్సవ మహాసభల తీర్మాణాలను సోమవారం మంచిర్యాలలో వెల్లడించారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ (ఓపీఎస్) పునరుద్ధరించాలని, ఎన్ఈపీ-2020 రద్దుచేసి ప్రత్యామ్నాయ జాతీయ విద్యా విధానం తీసుకురావాలని, విద్యారంగానికి జీడీపీలో 6 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని, తదితర 21 తీర్మాణాలు చేసినట్లు తెలిపారు.

గంగమ్మ లోతునే..!



వరదనీరు లేక వెలవెలబోతున్న గోదావరి



సోమగూడెంలో ఫిజోమీటర్ వద్ద భూగర్భ జలాలను నమోదు చేస్తున్న అధికారులు (ఫైల్)

- గతేడాది కంటే సగటున ఒకమీటరు దిగువకు నీటిమట్టం
- లోటు వర్షపాతంతో పైకి చేరని భూగర్భ జలాలు
- వర్షపు నీటిని ఒడిసిపడితేనే నీటి లభ్యత మెరుగు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: భూగర్భ జలాలు గతేడాది కంటే ఈ ఏడాది ఇంకా దిగువనే ఉన్నాయి. నైరుతి రుతుపవనాలు ఈ సీజన్‌లో ఆశించిన మేర వర్షపాతం అందించలేదు. జిల్లాలో ఇంకా లోటు వర్షపాతమే నమోదవుతోంది. దీంతో భూగర్భ జలాలు సైతం భూమి లోపలే ఉంటున్నాయి. వర్షాకాలం ఆరంభమై మూడునెలలు కావస్తున్నా గోదావరి నదిలోకి ఇంకా వరదలు రాలేదు. దీంతో నీటివనరుల్లో ప్రవాహం లేదు. వాగులు, వంకలు గరిష్ట నీటితో పారలేదు. చాలా వరకు చెరువులు పూర్తిస్థాయిలో నిండలేదు. గత నెల, ఈ నెలలో వానలు కురిసినప్పటికీ భారీ వర్షాలు లేక నీటి వనరుల్లో సరిపడా నీరు లేదు. దీంతో భూగర్భజలాలు పైకి రావడం లేదు. జిల్లాలో ఫిజోమీటర్లు ఏర్పాటు చేసిన చోట్ల నీటి లభ్యతను లెక్కించి ఏ ప్రాంతాల్లో ఎంత మేర నీళ్లు ఉన్నాయని భూగర్భ జలాల అధికారులు నమోదు చేస్తుంటారు. ఈ లెక్కల ప్రకారం గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో సగటున సుమారు ఒకమీటరు లోపలే నీరు ఉండడం గమనార్హం. అత్యధికంగా చెన్నూరు, కోటపల్లి మండలాల్లో సగటును రెండు మీటర్ల లోతుకు ఊట పడిపోయింది. మిగతా మండలాల్లోనూ అన్నింటిలో సగటున లోతు ఒక మీటరు ఉంది.

వరద రాక.. నీరు ఇంకక
ఈసారి వర్షాలు ఆశించిన మేర కురియకపోవడంతో వరదలు వచ్చి చెరువులు, కుంటలు ఉప్పొంగలేదు. దీంతో వరదలు వస్తేనే మళ్ళీ నీటివనరులు నిండి భూమిలోకి నీరు ఇంకే అవకాశం ఉంటుంది. అలా ఇంకిన నీరే భూగర్భ జలాలుగా నిల్వ కానున్నాయి. వీటినే సాగు, తాగునీటికి అవసరమైనప్పుడు వీటిని వెలికితీసుకునే అవకాశం ఉంది. జిల్లా పరీవాహక ప్రాంతాలకు గోదావరి, ప్రాణహిత నదులు, చిన్న, మధ్యతరహా నీటి ప్రాజెక్టులు, చెరువులు, అటవీ, కొండ ప్రాంతాలు నీటి ఇంకుడుకు ప్రధాన ప్రాంతాలుగా ఉన్నాయి. పట్టణ ప్రాంతాల్లో నీరు ఇంకే అవకాశం లేక వృథాగా నీరు వెళ్ళిపోతోంది. ఇంకుడు గుంతలు, సామూహిక గుంతల నిర్మాణం చేపడితే భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. మరోవైపు ఈ సారి వర్షాలు తక్కువగా ఉండడంతో నీరు భూమిలోకి ఇంకకపోవడంతో గతంతో పోలిస్తే తక్కువగా ఉంది. అయితే ఆందోళనకర పరిస్థితులేమి లేవని, ఈ నెలలో వర్షాలు కురిస్తే, సాధారణ స్థితికి చేరుకుంటుందని భూగర్భ జలాల అధికారులు పేర్కొంటున్నారు. వాన నీటిని ఒడిసి పట్టి ఇంకుడు గుంతల్లో నీటిని ఇంకేలా చేస్తే నీటి కొరత తీరి, భూమి పైపొరల్లోనే నీరు లభ్యమయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ఫిజోమీటర్లు ఉన్న ప్రాంతాల్లో భూ గర్భ జలాల సగటు (మీటర్లలో)

మండలం	గ్రామం	గతేడాది జూలై	ఈ ఏడాది జూలై
బెల్లంపల్లి	బెల్లంపల్లి	15.5	15.98
భీమిని	రాంపూర్	0.76	2.08
చెన్నూర్	చెన్నూర్	6.85	8.01
చెన్నూర్	కొమ్మెర	1.53	2.62
దండేపల్లి	మ్యాదరిపేట	4.56	4.48
హాజీపూర్	హాజీపూర్	4.86	5.12
జైపూర్	జైపూర్	1.77	2.92
జైపూర్	కుందారం	8.75	8.58
జన్నారం	ఇందన్‌పల్లి	4.32	3.44
కన్నెపల్లి	జన్కాపూర్	0.02	0.01
కాసిపేట	కొండాపూర్	1.61	3.75
కోటపల్లి	కోటపల్లి	15.08	17.52
లక్సెట్టిపేట	లక్సెట్టిపేట	0.32	0.98
మందమర్రి	మందమర్రి	3.84	4.50
మందమర్రి	పొన్నారం	15.41	16.66
నెన్నెల	నెన్నెల	5.94	6.76
తాండూరు	తాండూరు	14.21	15.54
వేమనపల్లి	నీల్వాయి	0.01	0.59
జన్నారం	జన్నారం	4.28	5.85
జన్నారం	తపాలాపూర్	2.96	3.09
భీమారం	భీమారం	7.84	8.11
మంచిర్యాల	మంచిర్యాల	4.22	6.39
నస్పూర్	నస్పూర్	4.40	6.70
వేమనపల్లి	లక్ష్మీపూర్	3.92	4.25
కన్నెపల్లి	నాయకిన్‌పేట్	5.78	7.44
మొత్తం	సగటు	5.54	6.45

ఇంటర్ ప్రవేశాలకు మరో అవకాశం..!



లక్సెట్టిపేట్ కళాశాల తరగతి గదిలో విద్యార్థులు

- ఈ నెల 20 వరకు గడువు పెంపు
- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచన

మంచిర్యాలఅర్బన్: ఇంటర్‌లో ప్రవేశాలు పొందే విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. కాలేజీలో అడ్మిషన్ కోసం దరఖాస్తుల గడువును మూడోసారి పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 20 లోపు దరఖాస్తులు అందజేయాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. జూన్ 1నుంచి ప్రారంభమైన ప్రవేశాలు జూలై 31తో ముగియగా ఆగస్టు 20 వరకు అడ్మిషన్ల గడువు పొడిగించింది. పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాలు విడుదల కావడంతో దరఖాస్తుల గడువు మరోసారి పెంచినట్లు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇంటర్ విద్య పూర్తిగా ఉచితం.. పాఠ్యపుస్తకాలు..స్కాలర్‌షిప్‌లు పొందవచ్చంటూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ప్రభుత్వ కళాశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, నాణ్యమైన బోధన తీరుపై అవగాహన కల్పించారు. ఇంటర్ విద్యాశాఖ అధికారులు ప్రతీ కళాశాల ప్రిన్సిపాల్‌తో ప్రత్యేకంగా సమావేశమై క్షేత్రస్థాయిలో ఏయే చర్యలు చేపట్టాలో అవగాహన కల్పించారు. గతేడాది కంటే ఈ ఏడాది మెరుగైన ఫలితాలు సాధించేలా విద్యార్థులపై శ్రద్ధ చూపుతామని తల్లిదండ్రులకు భరోసానిస్తున్నారు. ప్రవేశాల సంఖ్య పెరిగేలా చర్యలు ముమ్మరం చేశారు.

కార్పొరేట్ కళాశాలలకు దీటుగా...
పదో తరగతి ఫలితాలు వెలువడక ముందునుంచి కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్ల పెంపు ప్రక్రియ వేగవంతం చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మౌలిక సదుపాయాలతో పాటు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల్లో బోధన, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో ఎంసెట్ శిక్షణ, రోజువారీగా స్టడీ అవర్ నిర్వహణ, సొంత భవనం, విశాలమైన ఆటస్థలం, ఆహ్లాదకరమైన వాతావరణం, స్టడీ మెటీరియల్, స్కాలర్‌షిప్..ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే సాధ్యమంటూ పాఠశాలల వారీగా వెళ్లి సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు అవగాహన కల్పించడంతో క్రమంగా ఇంటర్‌లో ప్రవేశాల సంఖ్య పెరుగుతూ వస్తోంది. దీంతో మూడోసారి గడువు పొడిగించామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో అంజయ్య విద్యార్థులకు సూచించారు.

కళాశాలల్లో జనరల్, వొకేషనల్ విద్యార్థుల ప్రవేశాలు ఇలా...

కళాశాల	జనరల్	వొకేషనల్	మొత్తం
మంచిర్యాల	197	246	443
మందమర్రి	93	71	164
కాసిపేట	92	49	141
చెన్నూర్	175	0	175
బెల్లంపల్లి(గర్ల్స్)	176	0	176
బెల్లంపల్లి	222	215	437
జైపూర్	107	0	107
జన్నారం	99	0	99
దండేపల్లి	83	0	83
లక్సెట్టిపేట్	274	181	455
మొత్తం	1518	762	2280

లక్సెట్టిపేట్‌లో అత్యధికంగా ప్రవేశాలు..
లక్సెట్టిపేట్‌లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఆధునిక హంగులతో నూతనంగా భవనం నిర్మించారు. జిల్లాలో గతంలో 170 మంది కూడా దాటని విద్యార్థుల సంఖ్య ఈఏడాది 455కు చేరింది. జిల్లా కేంద్రమైన మంచిర్యాల ప్రభుత్వ కళాశాలలో 443 మందితో తర్వాత స్థానంలో నిలిచింది. బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 437 మంది అడ్మిషన్లు పొందారు. ఇలా ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరుగుతుండడంతో మూడోసారి అవకాశం కల్పించారు. దీంతో మరింత మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరే అవకాశం లేకపోలేదు.

ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: సీఎం ప్రజావాణి, జిల్లా ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, మంచిర్యాల అటవీ డివిజన్ అధికారి సర్వేశ్వర్‌తో కలిసి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా నస్పూర్ మండలం సంగుమల్లయ్యపల్లెకు చెందిన ఎం.వెంకటేశం రికార్డుల నుంచి తన కూలిపోయిన ఇంటినంబర్ తొలగించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణానికి చెందిన దుర్గం మోహన్ తాను నెన్నెల శివారులో కొనుగోలు చేసిన భూమిని తనపేరుపై పట్టా చేయాలని కోరుతూ అర్జీ అందజేశాడు. భీమారం మండలం సుంకరిపల్లి కాలనీకి చెందిన దినసరి కూలీ దుర్గం భాగ్య ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరింది. నస్పూర్ శ్రీరాంపూర్ ఏరియాకు చెందిన కోట మల్లయ్య 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న ఇల్లు ఇటీవల వేరొకరి పేరుమీద మార్పు జరిగిందని దీనిని సవరించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. నస్పూర్ మండలం ఆర్కే 6 క్రిష్ణాకాలనీకి చెందిన హరీష్ సీ టైప్ క్వాటర్ల వద్ద పగిలిపోయిన సెప్టిక్ ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరాడు. లక్సెట్టిపేట మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు మామిడి రాజశేఖర్ ఇంటర్ పూర్తి చేసి ఎల్‌టి శిక్షణ తీసుకున్నానని, ఏదైనా ఉపాధి చూపించాలని కోరుతూ అర్జీ అందజేశాడు. హాజీపూర్ మండలంలోని గుడిపేటకు చెందిన ఎంబడి జ్యోతి తన భర్త చనిపోయాడని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అర్జీ అందజేసింది. నస్పూర్ శివారులోని సర్వేనంబర్ 42లో ఉన్న టీఎస్టీవో ప్లాట్లలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ ఆధ్వర్యంలో ఫిర్యాదు అందజేశారు. ఆయా శాఖల అధికారులు అర్జీలు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు.

అక్రమ పట్టా రద్దు చేయాలి

బెల్లంపల్లిరూరల్: ఇళ్ల స్థలాలను అక్రమంగా చేసుకున్న పట్టాలు రద్దు చేసి తమపేరిట పట్టా జారీ చేయాలని కోరుతూ బెల్లంపల్లి మండలం మాలగురిజాలకు చెందిన బాధితులు ప్రజావాణిలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను వేడుకున్నారు. గ్రామానికి చెందిన దుర్గం అంకులు, ఏగోలపు లక్ష్మి, గోమాస రామస్వామి, కలాలి ధర్మయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 162లో అనేక ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, అదే గ్రామానికి చెందిన కామెర నారాయణ గోమాస పోశం వద్ద మూడుగుంటల భూమిని కొనుగోలు చేసి 13 గుంటలుగా పట్టా పొందాడన్నారు. తాము నివసిస్తున్న ఇంటి స్థలాల్లో నూతన ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా అడ్డుకుని భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. అక్రమంగా ఉన్న 10 గుంటల పట్టాను రద్దు చేసి తాము నివసిస్తున్న ఇంటి స్థలాలకు పట్టా మంజూరు చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.

చెరువు కబ్జాపై చర్యలు తీసుకోవాలి



బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమల హిల్స్ ఎర్రకుంట చెరువు పూర్తిగా కబ్జాకు గురికావడంతో వర్షం కురిస్తే నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. తిరుమల హిల్స్‌వెంచర్ అనుమతి లేకుండా వెంచర్‌చేసి ప్లాట్ల రూపకంగా అమ్ముకున్నారు. 11 ఎకరాల చెరువును మూడు ఎకరాలుగా చేసి సాయినిధి వెంచర్ ఏర్పాటు చేసి చెరువు ఆనమాలు లేకుండా చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలి.
– మంతెన కిరణ్‌కుమార్, రమేశ్, కన్నాల, బెల్లంపల్లి

యూరియా సరఫరా చేయాలి



గుండ్ల సోమవారం రైతు సంఘం సొసైటీ ఫర్టిలైజర్ తరపున గ్రామానికి చెందిన 20 మంది రైతులం యూరియా, 20:20 మందు బస్తాలకోసం రూ.3.70 లక్షలు జూలై 7న మార్క్‌ఫెడ్‌కు సంబంధించిన బ్యాంకులో కట్టాం. కానీ ఇప్పటి వరకూ యూరియా సరఫరా చేయలేదు. దీంతో పత్తి పంట తీవ్రంగా నష్టపోయేలా ఉన్నాం. వెంటనే యూరియా సరఫరా చేయాలి.
– రాజలింగు, గుండ్ల సోమవారం, నెన్నెల

వందేభారత్.. నష్టాల ప్రయాణం

- రెండు జిల్లాల్లో ఒక్క హాల్టింగ్ కూడా లేని రైలు..
- ఆక్యుపెన్సీ సాధించడంలో విఫలం
- పట్టించుకోని రైల్వే అధికారులు
- విజ్ఞప్తులతోనే సరిపెడుతున్న ప్రజా ప్రతినిధులు



వందేభారత్ రైలు

బెల్లంపల్లి: మహారాష్ట్రలోని నాగ్‌పూర్–సికింద్రాబాద్ మధ్య ప్రవేశపెట్టిన వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు వందశాతం ఆక్యుపెన్సీ లక్ష్య సాధనలో వెనుకంజలో ఉంది. డిమాండ్ ఉన్న రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ సదుపాయం లేకపోవడంతో ప్రయాణికుల ఆదరణ కరువవుతోంది. ఈ మార్గంలో వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని ఎంతగానో ఆరాటపడిన ప్రయాణికుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. మహారాష్ట్రలో నాగ్‌పూర్ తర్వాత సేవాగ్రామ్ (వార్ధా), చంద్రపూర్, బల్లార్షా రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించిన రైల్వే అధికారులు తెలంగాణ రాష్ట్రానికి వచ్చేసరికి కుమురంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో ఏ ఒక్క రైల్వేస్టేషన్‌లోనూ నిలుపుదల ఉత్తర్వులు జారీ చేయకపోవడం రైలు ప్రయాణికులను తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. చంద్రపూర్–బల్లార్షా మధ్య కేవలం 13 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంది. ఆప్రాంతంలో నిరభ్యంతరంగా హాల్టింగ్‌కు పచ్చజెండా ఊపి పదుల కిలోమీటర్ల దూరం ఉన్న ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని రైల్వేస్టేషన్‌లను విస్మరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల మూడు ప్రధాన రైల్వేస్టేషన్‌లతో పాటు జిల్లా కేంద్రమైన పెద్దపల్లి రైల్వే జంక్షన్‌లోనూ హాల్టింగ్‌కు ఉత్తర్వులు జారీ చేయాలన్న ప్రయాణికుల డిమాండ్‌ను రైల్వే అధికారులు పెడచెవిన పెట్టారు. బల్లార్షా తర్వాత రామగుండం, కాజీపేట జంక్షన్‌లో మాత్రమే ఈ రైలు ఆగుతుంది. రామగుండంలో ఈ రైలు ఎక్కే ప్రయాణికులు అంతంత మాత్రమే. కాజీపేటలో పలు సూపర్ ఫాస్ట్ రైళ్లు అందుబాటులో ఉండటం వల్ల వందేభారత్ రైలు సక్సెస్ కాలేకపోతోందని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆక్యుపెన్సీ సాధనలో వెనుకంజ
వందేభారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు గతేడాది ప్రారంభం కాగా ఇప్పటికీ వందశాతం ఆక్యుపెన్సీ సాధించలేదు. అనాలోచిత నిర్ణయాలతో రైలును ఆదిలో 20 కోచ్‌లతో ప్రారంభించారు. అయితే ప్రయాణికుల ఆదరణ ఆశాజనకంగా లేక పోవడంతో క్రమంగా ఆక్యుపెన్సీ తగ్గుతూ వచ్చింది. ఫలితంగా గత ఫిబ్రవరి మూడో వారంలో కోచ్‌లను ఒక్కసారిగా 20 నుంచి 8కి కుదించారు. పరిమిత సంఖ్యలో కోచ్‌లు ఉండటంతో ప్రస్తుతం ఆక్యుపెన్సీ రేషియో క్రమంగా 70 శాతం వరకు పెరగడం కాస్త ఊరటనిస్తుండగా వందశాతం సాధించే దిశగా పరుగులు పెట్టలేకపోతోంది.

బుట్టదాఖలవుతున్న విజ్ఞాపన పత్రాలు
వందేభారత్ సూపర్‌ఫాస్ట్ రైలును ముఖ్యమైన రైల్వేస్టేషన్‌లలో ఆపాలని కోరుతూ ఏడాది కాలం నుంచి ప్రజా ప్రతినిధులు, ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం సభ్యులు రైల్వే అధికారులకు వినతి పత్రాలు అందజేస్తున్నారు. కానీ బలమైన వొత్తిళ్లు చేయడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కారణంగానే రైల్వే అధికారులు ఉలుకు పలుకు లేకుండా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. కాగజ్‌నగర్, బెల్లంపల్లి, మంచిర్యాల, పెద్దపల్లి జంక్షన్‌లలో హాల్టింగ్ సౌకర్యం కోసం ఉత్తర్వులు జారీ చేయాలని పలుమార్లు కోరినా సానుకూలంగా స్పందించడం లేదు. డిమాండ్ ఉన్న స్టేషన్‌లలో రైలు నిలుపుదల చేయకపోవడం వల్ల ఉపయోగం లేకుండా పోతోందని పలువురు పేర్కొంటున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, రైల్వే ఫోరం సభ్యులు అందిస్తున్న విజ్ఞాపన పత్రాలు బుట్టదాఖలు అవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రైల్వే అధికారులు పునరాలోచించి ప్రయాణికుల ఆదరణ చూరగొనేలా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గూడెంలో శ్రావణ సందడి



సత్యదేవున్ని దర్శించుకుంటున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణ సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ నెలకొంది. సాధారణ రోజుల్లో కంటే ఈరోజు భక్తులు అధిక సంఖ్యలో సత్యదేవున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

క్లుప్తంగా

'దేశీదారు' పట్టివేత



స్వాధీనం చేసుకున్న బైక్, మద్యం

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా తరలిస్తున్న 530 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. సోమవారం ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని భీంసరి గ్రామానికి చెందిన అలిశెట్టి అభిలాష్ అనే వ్యక్తి రూ.24వేల విలువ గల మద్యం సీసాలను మహారాష్ట్ర నుంచి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్నాడు. కొరట గ్రామ శివారులో ఎక్సైజ్ అధికారుల రాకను గమనించి బైక్‌తో పాటు మద్యం సీసాలను వదిలి పరారయ్యాడు. అభిలాష్‌పై కేసు నమోదు చేశామని, త్వరలో నిందితుడిని జైలుకు పంపిస్తామన్నారు. సిబ్బంది తానాజీ, ధీరజ్, హన్మంతు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి కేసులో 39 మంది అరెస్ట్

ఇచ్చోడ: పోలీసులపై దాడి ఘటనలో మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన 39 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల క్రితం అటవీశాఖ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా బందోబస్తుకు వెళ్లిన పోలీసులపై కేశవపట్నం గ్రామానికి చెందిన కొంతమంది మూల్తానీలు రాళ్లు, కర్రలతో దాడిచేసిన సంఘటన విధితమే. దాడిలో ఐదుగురు పోలీసులకు గాయాలయ్యాయి.

యువకుడికి గాయాలు



గాయపడిన యువకుడు రమేశ్

లక్ష్మణచాంద: కోతులు ఒక్కసారిగా బైక్‌పై దూకడంతో కిందపడి యువకుడు గాయపడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సోన్ మండలంలోని న్యూబొప్పారం గ్రామానికి చెందిన రమేశ్ అనే యువకుడు ఉదయం 7 గంటల సమయంలో తన స్నేహితుడిని మండలంలోని కనకాపూర్ వద్ద బైక్‌పై దింపి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వడ్యాల్ గ్రామంలో చెట్టుపై నుంచి కోతులు ఒక్కసారిగా బైక్‌పై దుకాయి. దీంతో రమేశ్ బైక్‌పై నుంచి రోడ్డుపై పడిపోయాడు. రమేశ్ కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.

ఆలయంలో చోరీ.. నిందితుడి అరెస్ట్

భైంసాటౌన్: పట్టణ శివారులోని కోతి హనుమాన్ ఆలయంలో చోరీకి పాల్పడిన దుండగుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ జి.గోపినాథ్ తెలిపారు. మండలంలోని కుంభి గ్రామానికి చెందిన సర్వాడే దిగంబర్ ఆదివారం రాత్రి ఆలయంలో హుండీ పగులగొట్టి నగదు అపహరించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమివ్వగా దొంగ అప్పటికే పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సోమవారం సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించారు. సోమవారం అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి రూ.1500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు. అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

నిషేధిత పొగాకు ప్యాకెట్ల పట్టివేత

తాండూర్: మండలంలోని రేపల్లెవాడ వద్ద నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సోమవారం సాయంత్రం రేపల్లెవాడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన మారుతి వ్యాన్‌ను తనిఖీ చేయగా సుమారు రూ.40 వేల విలువ కలిగిన నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లు లభ్యమయ్యాయన్నారు. ఆదిలాబాద్‌కు చెందిన సయ్యద్ ఆదిల్, సయ్యద్ ఫయాజ్, రాజు అనే ముగ్గురు వ్యక్తులు నిషేధిత పొగాకు ఉత్పత్తుల బ్యాగులను మంచిర్యాలకు తరలిస్తుండగా వారిని పట్టుకున్నామని తెలిపారు. పూర్తిస్థాయిలో విచారించి వారిని మంచిర్యాల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్‌కు అప్పగించి కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని నర్సరీలో గల కుంటలో ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి చందు (14) మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఉట్నూర్ పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన సురేశ్ కుమారుడు చందు స్నేహితులతో కలిసి ఆదివారం సాయంత్రం కుంటలో ఈత కొడుతూ మునిగిపోగా తన స్నేహితులు ఎవరికీ చెప్పకుండా ఇళ్లకు వెళ్లిపోయారు. సురేశ్ కొడుకు ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం గాలించాడు. సోమవారం మధ్యాహ్నం కుంటలో విద్యార్థి మృతదేహం తేలడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విజిట్ వీసా.. ఎడారి గోస!

- గల్ఫ్ దేశాలకు వెళ్లి జిల్లా యువత అష్టకష్టాలు
- పర్యాటకవీసాలపై నైపుణ్యరహిత పనుల్లో చేరిక
- చట్టాలపై అవగాహన లేక చేయని నేరానికి జైలుకు
- క్షేమసమాచారం తెలియక బాధిత కుటుంబసభ్యుల ఆందోళన



ఆచూకీ తెలుసుకోవాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించిన బాధిత కుటుంబ సభ్యులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: ఉన్న ఊరిలో పనులు లేక కుటుంబాలను పోషించుకునేందుకు గ్రామీణ పేద, దిగువ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన యువకులు దేశం కాని దేశం వెళ్లి అష్టకష్టాలు పడుతున్నారు. కంపెనీ వీసాలు దొరక్క విజిట్ వీసాలపై వెళ్లిన వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. ఉపాధి వేటలో ఎలాగైనా గల్ఫ్ దేశం వెళ్లాలన్న యువకుల బలమైన కాంక్షను ఆసరాగా చేసుకున్న నకిలీ ఏజెంట్లు తాత్కాలిక, పర్యాటక వీసాలను అంటగట్టి రూ.లక్షలు దోచేస్తున్నారు. అలా వెళ్లిన జిల్లా వలస కార్మికులు నైపుణ్య రహిత పనుల్లో దుర్భర జీవితాలు గడుపుతున్నారు. గల్ఫ్ దేశాల చట్టాల ప్రకారం వీసా లేకుండా పనిచేయడం నేరం కావడంతో అక్కడి పోలీసులు వారిని అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో వారి జాడ, క్షేమ సమాచారం స్వదేశంలో ఉన్న కుటుంబ సభ్యులకు తెలియక తల్లడిల్లుతున్నారు. జిల్లాలో ఇలాంటి కేసులు తరుచుగా వెలుగులోకి వస్తున్నాయి.

నకిలీ ఏజెంట్ల వలలో చిక్కి..

కంపెనీ ఉద్యోగాల పేరిట అధిక వేతనాల ఆశ చూపుతూ పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న నకిలీ ఏజెంట్లు గ్రామీణ మధ్యతరగతి యువతకు ఎరవేస్తున్నారు. విదేశాలకు వెళ్లి ఉన్నతంగా స్థిరపడిన వారిని చూసి యువత తామూ అలాగే ఎదగొచ్చని ఆశపడుతూ అప్పుచేసి రూ.లక్షలు ముట్ట చెబుతున్నారు. తీరా అక్కడికి వెళ్లిన తర్వాత మోసపోతున్నారు. గత ఆరు నెలల కాలంలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన జిల్లాకు చెందిన పలువురు యువకులు అక్కడి పోలీసులకు చిక్కడంతో ఆచూకీ తెలియక కుటుంబసభ్యులు నరకయాతన అనుభవిస్తున్నారు.

నైపుణ్య రహిత పనుల్లోనే..

విదేశాలకు వెళ్లాలన్న తపనతో రూ.లక్షలు వెచ్చించి అక్కడ నైపుణ్య రహిత పనులైన భవన నిర్మాణ రంగం, ఆఫీస్ బాయ్, క్లీనింగ్ తదితర పనులు చేస్తూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అక్కడి చట్టాల పట్ల అవగాహన లేకపోవడం, ఉన్నతచదువులు లేకపోవడం, నైపుణ్య రంగాల్లో అనుభవం లేకపోవడం కూడా ఇందుకు మరో కారణంగా గల్ఫ్ సంక్షేమ సంఘాల నాయకులు అభిప్రాయ పడుతున్నారు. విదేశాలకు వెళ్లాలనుకునే వారు తప్పనిసరిగా వివిధ వృత్తి పనుల్లో అనుభవం కలిగి ఉండాలని, అలాంటి పనుల నిమిత్తమే రిజిస్టర్డ్ ఏజెంట్ల ద్వారావిదేశాలకు ఉపాధి కోసం వెళ్లాలని సూచిస్తున్నారు.

ఇటీవల చోటుచేసుకున్న పలు ఘటనలు..

- నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన పన్నాల శ్రీనివాస్ సౌదీ అరేబియా దేశం వెళ్లి గత మేలో పనిలో చేరాడు. అక్కడి యజమాని తన వ్యవసాయ క్షేత్రానికి పంపగా ఒకసారి భార్య పిల్లలకు ఫోన్ చేశాడు. అనంతరం అతని నుంచి ఇప్పటివరకు ఎటువంటి క్షేమ సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.
- సోన్ మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన కిస్టాపురం లక్ష్మన్న సబ్ ఏజెంట్ ద్వారా రూ.2లక్షలు వెచ్చించి దుబాయ్‌కి లేబర్ సప్లయ్ కంపెనీ వీసా ద్వారా వెళ్లి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. సరైన వేతనం కూడా లేకపోవడంతో స్వదేశానికి రప్పించే ఏర్పాటు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు అధికారులను వేడుకుంటున్నారు.
- మామడ మండలం పరిమండల్ గ్రామానికి చెందిన గొర్రె రాజేందర్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. అక్కడ ఆయన వేతన ఖాతాలో అక్రమ నగదు బదిలీ కాగా కేసులో ఇరుక్కున్నాడు. స్వదేశానికి తిరిగి రాలేక అక్కడి పోలీసుల అదుపులో ఉన్నాడు. తమ కొడుకుని ఎలాగైనా ఇండియాకు రప్పించాలని తండ్రి గంగన్న, కుటుంబ సభ్యులు కలెక్టర్ కార్యాలయంలో విజ్ఞప్తి చేశారు.
- లోకేశ్వరం మండలం రాజురా గ్రామానికి చెందిన సాయినాథ్, సారంగాపూర్ మండలం దేవితండాకు చెందిన జాదవ్ మధుకర్ గల్ఫ్ దేశాల్లో వివిధ రకాల కేసుల్లో ఇరుక్కొని అష్టకష్టాలు పడుతున్నారు.
- కుంటాల మండలం అంబకంటి గ్రామానికి చెందిన గొర్రెకర్ శ్రీనివాస్ దుబాయ్‌లో సైబర్ నేరం కేసులో కటకటాలపాలవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

ఉపాధివేటలో ఆగిన గుండె

- ఉజ్బెకిస్తాన్‌లో వలస కార్మికుడి మృతి

నిర్మల్‌ఖిల్లా: ఉపాధివేటలో విదేశాలకు పయనమైన జిల్లాకు చెందిన యువకుడి గుండె అక్కడే ఆగింది. దస్తూరాబాద్ మండలం మున్యాల్ గ్రామ పంచాయతీ పరిధి కొత్త పెద్దూర్ గ్రామానికి చెందిన సంగ సురేశ్ (33) ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లి గుండెపోటుతో మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. గల్ఫ్ దేశం వెళ్లేందుకు సురేశ్ కడెం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన సబ్ ఏజెంట్‌ను సంప్రదించి రూ.2.50 లక్షలు ముట్టజెప్పాడు. సదరు సబ్‌ఏజెంటు మొదట 9 రోజులు ఢిల్లీలో ఉంచి అక్కడి నుంచి టూరిస్ట్ వీసా మీద ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంటుకు పంపాడు. అక్కడ క్లీనింగ్ పని కోసం 15 రోజులు శిక్షణ పొందాడు. అనంతరం డ్యూటీలో చేరిన నాల్గోవ రోజు (గత నెల 21) గుండెపోటు రాగా ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో సురేశ్ మృతి చెందినట్లు కంపెనీప్రతినిధులు కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. కాగా అక్కడి ఏజెంట్ మృతదేహాన్ని కార్గోలో పంపడానికి డబ్బు ఖర్చువుతుందని, ఢిల్లీ వరకు మాత్రమే పంపగలమ ని రోజుకో మాట చెబుతూ కాలయాపన చేస్తున్నట్లు కుటుంబసభ్యులు వాపోతున్నారు.

కలెక్టర్, రాష్ట్ర ఎన్ఆర్ఐ సభ్యులకు వినతి..

తాజాగా సోమవారం మృతుడి భార్య సంగ మమత, ఇద్దరు పిల్లలు, మామ జింక భూమన్నలతో కలిసివచ్చి ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు సమస్య విన్నవించారు. స్పందించిన కలెక్టర్ వివరాలు తీసుకొని మృతదేహం త్వరగా ఇండియా పంపేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ సభ్యుడు స్వదేశ్ పర్కిపండ్లకు వివరాలతో కూడిన పత్రాలు అందించి మృతదేహాన్ని త్వరగా ఇండియాకు రప్పించాలని వేడుకున్నారు. ఏజెంట్‌కు కట్టిన నగదు తిరిగి ఇప్పించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని విన్నవించారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



నకిలీ ఏజెంట్లను నమ్మి విజిట్ వీసాలపై గల్ఫ్ దేశాలకు వెళ్లొద్దు. వృత్తిపరమైన శిక్షణతో కూడిన పనులకు మాత్రమే వెళ్లాలి. రిజిస్టర్డ్ ఏజెంట్లు, కంపెనీల ద్వారా వీసా రుసుము చెల్లించిన తర్వాతనే పయనమవ్వాలి. ప్రవాసీ భారత బీమా యోజన ఇన్సూరెన్స్ కలిగి ఉండాలి. గల్ఫ్ దేశాల నియమ, నిబంధనలు, చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి.

– మంద భీమ్‌రెడ్డి, ఎమిగ్రెంట్స్ వెల్ఫేర్ ఫోరమ్ ప్రతినిధి, ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ వైస్‌చైర్మన్

ఎస్సారెస్పీకి 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మామడ: ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091 అడుగులు కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1079.80 అడుగుల నీటి మట్టం ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 44.49 టీఎంసీలుగా ఉంది. కాగా సరస్వతీ కాలువ కింద సాగు చేసిన పంటల కోసం 800 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

బాసర గోదావరిలో భక్తుల మొక్కులు



గోదావరి నదిలో దీపం వదులుతున్న భక్తులు

బాసర: వరద నీరు భారీగా వచ్చి చేరుతుండడంతో బాసర వద్ద గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. నదిలో నూతనంగా నీరు ప్రవహిస్తుండడంతో శ్రావణమాసం పురస్కరించుకొని భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి గోదారమ్మకు దీపాలు వదిలి మొక్కులు చెల్లించుకుంటున్నారు. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరవడంతో వరద నీరు భారీగా వస్తోంది.

'కార్మికుల శ్రమను దోచుకుంటున్న సంఘాలు'

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, బీఎంఎస్, టీబీజీకేఎస్ సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కై సింగరేణి కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని సింగరేణి కార్మిక సమాఖ్య(సికాస) కార్యదర్శి అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి కార్మికుల సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. ఆదాయ పన్ను రద్దు, సొంతింటి కల, ప్రైవేటీకరణ అడ్డుకుని కొత్తగనులు ఏర్పాటు, కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ కమిటీ వేతనాలు, ఉద్యోగ భద్రత వంటి వాగ్దానాలు ఇచ్చి గెలిచిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాలు, నాయకులు సీతారామయ్య, జనక్‌ప్రసాద్‌లు కార్మిక వర్గాన్ని మోసం చేస్తూ అవినీతి వాటాలతో తోడుదొంగలుగా మారారని విమర్శించారు. డిమాండ్ల సాధనలో సింగరేణి కార్మికవర్గం, కాంట్రాక్ట్ కార్మికులు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

ట్రిపుల్‌ఐటీలో ఉత్తమ విద్య

- ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్



ఒప్పంద పత్రాలతో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, మెటా గేట్ అకాడమీ సిబ్బంది

బాసర: ఆర్జీయూకేటీ అందించే ఉత్తమ విద్య, ఆధునిక సౌకర్యాలు, సాంకేతిక వనరులను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ అన్నారు. బాసర క్యాంపస్‌లో నూతన విద్యార్థుల తల్లిదండ్రులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అకడమిక్ జ్ఞానంతో పాటు సమగ్ర వ్యక్తిత్వ వికాసం సాధించేందుకు కృషి చేయాలన్నారు. తల్లిదండ్రులు ప్రతీరోజు కనీసం 5 నిమిషాలు పిల్లలతో మాట్లాడి, వారి విద్యాప్రగతి, మానసిక స్థితి, లక్ష్యాలపై చర్చించాలని సూచించారు. అసోసియేట్ డీన్స్ డా. విటల్, డా. నాగరాజు, డాక్టర్ మహేశ్, శ్రీనివాస్, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెటా గేట్ అకాడమీతో ఒప్పందం

ఆర్జీయూకేటీలోని మెటలర్జీ –మెటీరియల్స్ ఇంజనీరింగ్ విభాగం, హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న మెటా గేట్ అకాడమీల మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంపై ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ సమక్షంలో ఓఎస్డీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రొఫెసర్ మురళీధర్షన్, మెటా గేట్ అకాడమీ డైరెక్టర్ శ్రీ ఎస్. గురుప్రసాద్ సంతకాలు చేశారు. ఉత్తమ ప్రతిభ కలిగిన విద్యార్థులకు గేట్ ఉచిత శిక్షణ అందించేందుకు ఈ ఒప్పందం కుదిరింది. మెటలర్జీ విభాగాధిపతి శ్రీ కిరణ్ కుమార్, అసోసియేట్ డీన్లు డాక్టర్ మహేశ్, డాక్టర్ విట్టల్, అధ్యాపకులు డాక్టర్ ఆర్.అజయ్, వి.అజయ్ తదితరులు పాల్గొన్నారు.

వాగు దాటి.. వైద్యం అందించి



వాగు దాటి వెళ్తున్న వైద్య సిబ్బంది

నార్నూర్: వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో పలు గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులపై వంతెనలు లేని గ్రామాల వాసులు ప్రమాదకరంగా వాగులు దాటాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కాగా సోమవారం గాదిగూడ మండలంలోని అర్జుని గ్రామ పంచాయతీ పరిధి మారుగూడ గ్రామంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేదు. గ్రామానికి వెళ్లే మార్గం మధ్యలో పెద్దవాగు ఉండగా వైద్య సేవలు అందించేందుకు ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది హెచ్ఈ రవీందర్ రాథోడ్, ఏఎన్ఎం సులోచన, అరవింద్, గంగాధర్‌లు ప్రమాదకరంగా వాగు దాటారు. దాదాపు కిలోమీటరు కాలినడకన వెళ్లి వైద్యశిబిరం నిర్వహించారు. వారి వెంట ఉపాధ్యాయులు మెస్రం శేఖర్, జాదవ్ జ్యోతి, శ్యామ్‌రావు తదితరులు ఉన్నారు.

యూట్యూబర్ పేరిట మోసం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ

కౌటాల: యూట్యూబ్ స్టార్ హర్షసాయి అనుచరుడని ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడిన మొహమ్మద్ తౌఫిక్‌ఖాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు కౌటాల సీఐ సంతోష్‌కుమార్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. హర్యానాలోని మేవార్ జిల్లా లోహికాకాల గ్రామానికి చెందిన మొహమ్మద్ తౌఫిక్ ఖాన్ అదే రాష్ట్రానికి చెందిన సహచరులు ముబారక్ ఖాన్, వసీమ్‌ఖాన్, అహ్మద్ ఖాన్, ఇమ్రాన్‌లతో కలిసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. యూట్యూబర్ హర్షసాయి పేరుతో నకిలీ నంబర్లు, వాట్సాప్ వాడుతూ ప్రజలకు ఆర్థికసాయం, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ ఫోన్ పే, ఇతర ఆన్‌లైన్ మధ్యమాల ద్వారా డబ్బులు వసూలు చేసి మోసం చేస్తున్నారు. గత మేలో జిల్లాలోని బెజ్జూర్ మండలం సలుగుపల్లి గ్రామానికి చెందిన ఆత్రం సాయిని నమ్మించి రూ. 28వేలు వసూలు చేశారు. అనంతరం అతని ఫోన్ నంబర్ కలవకపోవడంతో మోసపోయానని గుర్తించి సాయి బెజ్జూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు పై లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు నిందితుడిని హర్యానాలో పట్టుకున్నారు. మిగితా నిందితుల కోసం గాలిస్తున్నారు. నిందుతుడి వద్ద నుంచి సెల్‌ఫోన్, సిమ్‌లు, ఆన్‌లైన్ లావాదేవిల రికార్డులు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో శ్రమించిన ఎస్సైలు సర్తజ్‌పాషా, తేజస్విని, కానిస్టేబుల్ వినోద్, సందీప్‌ను సీఐ అభినందించారు.

విద్యార్థిని ఆత్మహత్య



లక్ష్మీప్రసన్న (ఫైల్)

జైపూర్: అనారోగ్య సమస్యలతో, హాస్టల్‌లో ఉండలేక ఇంటికి వచ్చిన విద్యార్థిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని వేలాల గ్రామానికి చెందిన దామెరకుంట శ్రావణి –రవి దంపతులకు వైష్ణవి, లక్ష్మీప్రసన్న ఇద్దరు కూతుళ్లు. చిన్న కూతురు లక్ష్మీప్రసన్న(13) జైపూర్ కేజీబీవీలో 8వ తరగతి చదువుతోంది. ఆమె కొద్ది రోజులుగా పంటి నొప్పి, చెవి నొప్పితో బాధపడుతోంది. ఆమెకు చికిత్స చేయించేందుకు నెల క్రితం తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చి ఆసుపత్రిలో చూపించారు. అనారోగ్య సమస్యలకు తోడు చదువుపై ఆసక్తి లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆదివారం రాత్రి ఇనుపరాడ్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బాలిక తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ వెల్లడించారు.

'దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి'



ఆర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ప్రజావాణిలో అందించిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో పీవో దరఖాస్తులు స్వీకరించారు. బేల మండలం నుంచి హరిత, ఇంద్రవెల్లి మండలం జాలంతండాకు చెందిన కుమ్మర రేణుక, గాదిగూడ మండలంలోని జరీ గ్రామానికి చెందిన కుడిమేత అశ్విని, ఆత్రం భగవంతురావు ఇంద్రవెల్లి మండలం మర్కాగూడకు చెందిన సంగీత తదితరులు తమ సమస్యలు పరిష్కరించాలని ఆర్జీలు సమర్పించారు.

పరారీలో ఉన్న వ్యక్తి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: 20 ఆటోల చోరీల్లో నిందితుడిగా ఉన్న జైనూర్‌కు చెందిన సయ్యద్ అలీ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆటో చోరీలకు సంబంధించి మొత్తం ఏడుగురు నిందితులు ఉండగా, అందులో ఇద్దరు పరారీలో ఉన్నారు. వీరిలో సయ్యద్ అలీ అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

'కార్మిక సమస్యలపై పోరాడుతాం'



బహిరంగ సభలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతామని బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన సీసీసీ కార్నర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. సింగరేణిలో పర్మినెంట్ ఉద్యోగులతో చేయించాల్సిన బొగ్గు ఉత్పత్తిని కూడా కాంట్రాక్టర్లతో చేయిస్తున్నారన్నారు. బొగ్గు ఉత్పత్తి 50 శాతం పర్మినెంట్ ఉద్యోగులు, సంస్థ ఆధ్వర్యంలోనే జరగాలన్నారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన లాభాలు ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించాలన్నారు. యూనియన్ రాష్ట్ర నాయకులు మండ రామాకాంత్, పులి రాజిరెడ్డి, అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి రాజేందర్, నాయకులు కమలాకర్, కిరణ్‌కుమార్, మహేందర్, నాగేశ్వర్ రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తికి జైలు

మందమర్రిరూరల్/ ఆదిలాబాద్‌టౌన్: పెళ్లి చేసుకుంటానని యువతిని నమ్మించి మోసం చేసిన నిందితుడికి రెండేళ్ల జైలు శిక్షతో పాటు రూ.12వేల జరిమానా విధిస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి కుమార్ వివేక్ తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి రాఘవేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాధితురాలికి సింగరేణిలో పనిచేస్తున్న ఎదునూరి సుధాకర్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెతో ప్రేమ వ్యవహారం కొనసాగించి శారీరకంగా వాడుకున్నాడు. బాధితురాలు విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో తన తల్లిదండ్రులను ఒప్పించి ఆమెను పెళ్లి చేసుకుంటానని సుధాకర్ నమ్మించి మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. దీంతో బాధితురాలు ఫిర్యాదు చేయడంతో 2020 డిసెంబర్ 20న అప్పటి ఎస్సై భూమేష్ కేసు నమోదు చేశారు. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ పీపీ రమణారెడ్డి 14 మందిని విచారించి నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

భారీ వాహనాల రాకపోకలపై నిషేధం ఎత్తివేత



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో

జన్నారం: జన్నారం గుండా పగటిపూట భారీ వాహనాల రాకపోకల నిషేధం ఎత్తివేస్తున్నట్లు వైల్డ్ లైఫ్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి ఏలుసింగ్ ఆదేశాలు జారీ చేసినట్లు మంచిర్యాల జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్ తెలిపారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలోని ఎఫ్‌డీవో కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన్నారం మీదుగా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు భారీ వాహనాలు అనుమతి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా గతంలో మాదిరి భారీ వాహనాలకు రూ.150 పర్యావరణ శిస్తు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వాహనాల అనుమతి తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రేంజ్ అధికారులు సుష్మారావు, శ్రీధరచారి, దయాకర్, పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరింపులు

- బాధితుడి నుంచి రూ.30వేలు దండుకున్న నిందితుడు
- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

ఆదిలాబాద్‌టౌన్: ఓ మహిళకు ద్విచక్ర వాహనంపై లిఫ్ట్ ఇచ్చినందుకు బెదిరింపులకు పాల్పడి వాహనదారుడి నుంచి డబ్బులు వసూలు చేసిన నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. గతనెల 21న మధ్యాహ్నం 2 గంటల సమయంలో కలెక్టర్ కార్యాలయం సమీపంలో ఓ మహిళ పట్టణంలోని వేష్కర్ రవికుమార్‌ను లిఫ్ట్ కోరింది. దీంతో ఆయన తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని ఆమెను కైలాస్‌నగర్‌లో దింపాడు. ఆ మహిళ అతని ఫోన్ నంబర్ తీసుకుందని, తర్వాత 23న ఉదయం 11 గంటలకు వాగాపూర్‌కు చెందిన చాకటి కిరణ్ అనే వ్యక్తి ఫోన్ చేసి తన మరదలను ఫోన్‌లో ఎందుకు వేధిస్తున్నావని బెదిరింపులకు గురి చేశాడు. తమకు రూ.50 వేలు ఇవ్వాలని లేకుంటే ధర్నా చేపడతామని, పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బెదిరించాడు. దీంతో బాధితుడు తన వాహనం తాకట్టు పెట్టి రూ.30వేలను అదేరోజు సాయంత్రం చాకటి కిరణ్‌కు అందజేశాడు. ఈ విషయాన్ని తన తండ్రి రిటైర్డ్ ఎస్సై లక్ష్మణ్‌కు తెలుపగా, ఆయన వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.